నేను, రాఘవ, రెడ్డి ముగ్గురం ఒక దగ్గర కూర్చుని మనసు విప్పి మాట్లాడుకుంటే అతడి గురించి తెలిసింది. అతడి పేరు ప్రసాద్. ప్రసాద్ మాకు స్నేహితుడంటే స్నేహితుడు. కాదంటే కాదు. అతడి గురించి ఇంకా వివరంగా తెలియాలంటే ముందుకు వెళ్లాలి.

ఆ రోజు నేను ఆఫీసులో ఉన్నాను. ఫోన్ వచ్చింది. మా రిసెప్షనిస్టు "ఎవరో ప్రసాద్ గారట!" అంటూ కనెక్షన్ ఇచ్చింది.

"హలో! గుడ్ మార్నింగ్ సార్. నేను ప్రసాద్‌ని. కె అండ్ కె ఇంజనీరింగ్ కంపెనీ" చెప్పాడు ప్రసాద్.

"గుడ్‌మార్నింగ్! చెప్పండి."

"మిమ్మల్ని కలవాలనుకుంటున్నాను. పది నిముషాల్లో వస్తున్నాను.మీరు ఉంటారా?" అపాయింట్‌మెంట్ అడిగాడు.

"ఉంటాను రండి." ఫోన్ పెట్టేశాను.

సరిగ్గా పది నిముషాల తర్వాత ద్వారకానగర్ నుంచి డాబా గార్డెన్స్‌లో ఉన్న మా ఆఫీసుకి కారేసుకుని హడావిడిగా వచ్చాడు ప్రసాద్.

"ప్లీజ్, టేక్ యువర్ సీట్' అన్నాను కుర్చీ చూపిస్తూ.

ప్రసాద్ కూర్చున్నాడు.

"ఏం తీసుకుంటారు? కాఫీ, టీ, డ్రింక్' అడిగాను మర్యాదపూర్వకంగా.

"ఏదీ వద్దు." అంటూ జేబులోంచి త్రిబుల్ ఫైవ్ సిగరెట్టు ప్యాకెట్ తీసి అందులోంచి ఓ సిగరెట్టు తీసి "కెన్ ఐ స్మోక్?" అని అడిగాడు.

"యూ కెన్ స్మోక్' అంటూ కుర్రాడికి చెప్పి టేబుల్ మీద యాష్‌ట్రే పెట్టించాను.

"ఎస్.వి. రావు ఎప్పట్నుంచి మీకు తెలుసు?" అడిగాడు ప్రసాదు సిగరెట్ కొంత పీల్చి పొగ వదులుతూ మధ్యలో.

"గత పదేళ్లుగా ఎస్.వి. రావు నాకు మంచి ఫ్రెండ్. ఇద్దరమూ కాలేజీలో బి.ఎస్‌సి. చదువుకున్నాం. వాడు కోరమాండల్‌లో ఇంజనీర్‌గా చేరాడు. నేను బిజినెస్ లైన్లోకి వచ్చేశాను."

"ఐ సీ!" అన్నాడు ప్రసాదు తల ఊపుతూ, కనుబొమ్మలు పైకెత్తి.

"మీకు ఎస్.వి. రావు తెలుసా?" అడిగాన్నేను.

"ఆయన పంపితేనే ఇప్పుడు మీ దగ్గరికి వచ్చాను. నాకొక పని చేసిపెట్టండి."

"విత్ ప్లెజర్. చెప్పండి."

"పెందుర్తిలో పదెకరాల స్థలం తీసుకున్నాను. ఓ ప్రాజెక్టు ప్రపోజల్‌లో ఉంది. దానికి అప్రూవల్ కావాలి. ఉడాలో మీకు ఆ సెక్షన్‌లో తెలిసిన వారు ఉన్నారని రావు చెప్పాడు. అదొకటి. రెండోది- మీ చేతుల్లోనే ఉంది. అక్కడ నీరు పడుతుందని సర్టిఫికెట్ ఇవ్వాలి" అభ్యర్థిస్తున్నట్లు మొహం పెట్టి అన్నాడు ప్రసాదు.

ఆ అభ్యర్థనని నేను తిరస్కరించలేను. ఎందుకంటే ఎస్.వి. రావు పంపించాడు కాబట్టి. "రెండు పనులూ మీకు నేను చేసి పెడతాను. అయితే నాకు కొంత టైమ్ కావాలి."

"ఫర్వాలేదు. మీకు కావాల్సిన టైమ్ తీసుకోండి. కాని నాకు ఆ పని అయిపోవాలి."

"తప్పకుండా అవుతుంది."

"థాంక్యూ సార్. ఎప్పుడు రమ్మంటారు?" ప్రసాదు వెంటనే అడిగాడు.

"మీరు రానక్కరలేదు. అవసరమయిన కాగితాలు ఇచ్చి వెళ్లండి. అవసరమయితే వెంటనే ఫోన్ చేస్తాను" అన్నాన్నేను. వెంటనే అయ్యే పని కాదది.

సరిగ్గా రెండ్రోజుల తరువాత ప్రసాదు దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. "ఎంతవరకు వచ్చింది సార్ నా పని?" అడిగాడు. ఇద్దరం పరస్పరం విష్ చేసుకున్నాక.

"నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మీరే చేశారు. అర్జెంటుగా మీరు రాగలరా?" అన్నాన్నేను.

"తప్పకుండా. వెంటనే వచ్చేస్తున్నాను." అని అన్న పది నిముషాల్లో ప్రసాదు వచ్చాడు.

ప్రసాదుని తీసుకుని ఉడాకి బయల్దేరాను. కావలసిన కాగితాలు అన్నీ అతడిచేత సబ్‌మిట్ చేయించాను. నాలుగయిదు సెక్షన్లు తిరిగాం. ప్లానింగ్ ఆఫీసర్‌ని, వైస్ ఛైర్మన్‌ని, చీఫ్ ఇంజనీర్‌ని కలిశాం. నాకు తెలిసిన ఒక ముఖ్యమైన వ్యక్తి ద్వారా లోపాయికారిగా ఆంతరంగిక విషయాలు తెలుసుకున్నాం. ఆ దార్లో కూడా వెళ్లాం. అదీ అ[illegible] బారి అ[illegible]ది తరువాత తెలిసింది




పని అయిపోయింది

అప్రూవల్ కాగితాలు చేతికి వచ్చాయి. ప్రసాదు చాలా హేపీ అయిపోయాడు. నేను జియాలజిస్టుని. కాబట్టి నీరు పడుతుందో లేదో చెప్పే సర్టిఫికెట్ వెంటనే ఇచ్చాను.

"థాంక్యూ రామారావు గారు. మీకు చాలా శ్రమ ఇచ్చాను. రేపు సాయంత్రం నేను దసపల్లాలో చిన్న పార్టీ ఇస్తున్నాను. ఆరు గంటలకల్లా వచ్చేయండి. బైది బై. ఆ రోజు నాకు పరిచయం చేశారు రాఘవ! ఆ రాఘవని కూడా తీసుకురండి."

"ఎందుకండీ ఇవన్నీ?" అన్నాను నేను మొహమాటంగా. కాని ఇంతకి వెయ్యి రెట్లు ఆయన ఇవ్వాలి. కనీసం నాఫీజు అయినా ఇవ్వలేదు. సరేం ఏం చేస్తాడో చూద్దాం అనుకున్నాను.

"అబ్బే! అదేంలేదు. రేపు ఆరు గంటలకి దసపల్లా!" హడావిడిగా వెళ్లిపోయాడు.

"ఓకే!" అన్నాను. అది అతడికి వినపడి ఉంటుంది.

రాఘవని తీసుకుని నేను స్కూటర్ మీద దసపల్లాకి ప్రసాదు చెప్పిన టైమ్‌కి బయల్దేరాం. కరెక్టుగా 6 గంటలయింది.

ప్రసాదు రాలేదు. లాబీలో కూర్చుని వెయిట్ చేస్తున్నాం.

ఆరున్నర అయింది. కంగారు కంగారుగా వచ్చాడు ప్రసాదు. "సారీ, రామారావు! సారీ రాఘవా! అనుకోకుండా లయన్స్ క్లబ్ మీటింగ్ ఉంటే వెళ్ళాను. పదండి, పదండి" అంటూ మమ్మల్ని తీసుకుని బార్ అండ్ రెస్టారెంట్ వైపు తీసుకెళ్లాడు.

లోపలికి వెళ్లాం.

ఒక చక్కని టేబుల్ ఎంచుకుని దానికి ఇరువైపులా కూర్చున్నాం.

డ్రింకు వచ్చింది. గ్లాసుల్లో పోసి సర్దాడు వెయిటర్. ప్రసాదు కూల్‌డ్రింక్, మేం విస్కీ గ్లాసులు ఎత్తాం. మేం తాగి వాగుతుంటే అతడు మమ్మల్ని వాగిస్తూ ఆనందిస్తున్నాడు. సరిగ్గా ఆ సమయంలో కంట్రోలు తప్పిపోయాడు రాఘవ.

ఏదో పిచ్చివాగుడు వాగుతున్నాడు.

"ఇంక ఇప్పుడు ఫుడ్ వద్దు. ఇంటికి వెళ్లిపోదాం" అన్నాన్నేను. రాఘవ పరిస్థితి అప్పటికే బాగులేదు. ఇంక ఫుడ్ తింటే ఎలా ఉంటుందో అని ఆ నిర్ణయం తీసుకున్నాను.

ప్రసాదు "ఒకె!" అని బిల్లు పే చేసేశాడు.

హోటల్ నుంచి బయటకు వస్తుంటే రాఘవని జాగ్రత్తగా తూలిపోకుండా తీసుకురావాల్సి వచ్చింది.

"నేను రాఘవని ఈ రోజుకి మా ఇంటికి తీసుకువెడుతున్నాను. ఈ రాత్రప్పుడు గాజువాక ఏం వెడతాడు? పొద్దున్నే పంపిస్తాను" అన్నాడు ప్రసాదు.

నాకూ అది మంచిది అన్పించింది.

నేను తీసుకెళ్దామంటే ఇల్లు చిన్నది. అందులో మా ఆవిడతో గొడవ. "సరే తీసుకెళ్ళండి. పొద్దున్నే గాజువాక వెళ్ళే ఏర్పాటు చెయ్యండి" అన్నాను.

రాఘవ కూడా "పదండి ప్రసాదు గారూ" అంటూ అతడి కారు డోరు తెరచి కూలబడి పడిపోయాడు.

నేను ఇంటికి వచ్చేస్తుంటే నాకు అప్పుడు అర్థమయింది. ప్రసాదు వ్యూహం! రాఘవతో ప్రసాదుకి పని ఉంది. ఇక రాఘవ పని అయిపోయినట్లే. ప్రసాదు పెందుర్తి సైట్‌లో ఎలక్ట్రికల్ కనెక్షనుకి, రాఘవ బంధువు ఎపిఎస్‌ఇబిలో పని చేయటానికి సంబంధం ఉంది.

ఆ తరువాత ప్రసాదు నా దగ్గరకి రాలేదు. రెండు మూడుసార్లు ఫోను చేశాను. "లేరండి" అని ఒకసారి, "బయటకు వెళ్ళారు" అని రెండు సార్లు సమాధానం వచ్చింది. అతడి ఆఫీసుకి వెళ్ళినా కూడా నేను అతడిని పట్టుకోలేకపోయేవాడ్ని.

టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న రాఘవ షాపుకి వెళ్ళాను. రాఘవ లేడు. వాళ్ళ సేల్స్‌మన్ ఉన్నాడు. రాఘవ గురించి అడిగితే "లేరు సార్. రోజూ ప్రసాదుగారి పని మీద వెళుతున్నారు. ఉంటే ప్రసాదు గారి షాపులో ఉంటారు. లేదంటే బయట పని మీద ఉంటారు" తాపీగా రొటీన్‌గా చెప్పాడు సేల్స్‌మన్.

ప్రసాదు షాపుకి వెళ్ళాను. అక్కడ లేరు వీరిద్దరూ. ఆ తరువాత రాఘవకి ఒక సారి ఫోను చేశాను.

"ఏంట్రా సల్లపూసయిపోయావు. ఆ ప్రసాదు తప్పించి నీకు మరే పని లేదా?" అడిగాను చిరుకోపంతో.

"అదేం లేది. మన చేతిలో ఉన్న పని కదా అని

చేస్తానని చెప్పాను. చేస్తున్నాను. అదికాక ప్రసాదు మా అబ్బాయికి టింపనీ స్కూల్లో సీటు ఇప్పిస్తానని చెప్పాడు'' అన్నాడు రాఘవ.

మరిక నేను మాట్లాడలేక పోయాను.

ఎరని వేసి చేపని పట్టుకున్నాడు. చేప ప్రసాదు చేతిలో ఉంది. ఇక నేను ఏం చెప్పినా రాఘవ వింటాడా?

"సరే నీ ఇష్టం" అని ఫోను పెట్టేశాను.

ఆ తరువాత ప్రసాదు, రాఘవ బెస్ట్ ఫ్రెండ్స్‌లాగ తిరిగారు. ప్రసాదు పని అయిపోయింది. రాఘవ పని అయిందో లేదో తెలియదు. ఆ మధ్యలో రాఘవ ద్వారకా నగర్‌లో ఉన్న ఆర్కిటెక్ట్ రెడ్డిని పరిచయం చేశాడు ప్రసాదుకి. ప్రసాదు సైటుకి కరెంటు కనెక్షను వచ్చేసింది. ఇక కావాలిసింది డిజైన్లు, ప్లాను అది ఆర్కిటెక్టు రెడ్డి వలన సాధ్యమవుతుంది.

ఒకసారి ప్రసాదుని రెడ్డి దగ్గరకు తీసుకువెళ్ళాడు రాఘవ. పరిచయాలు, పలకరించుకోవడాలు అయినాక ప్రసాదు అసలు విషయం దాచి మామూలుగా మొదలుపెట్టాడు.

"మీరు ఏ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ చదివారండి" అని.

'ఆంధ్రా యూనివర్సిటీయే!'' చెప్పాడు రెడ్డి.

"మీకు ప్రొఫెసర్ వెంకటరెడ్డి తెలుసా ఆయనది మా ఊరే"

"ఆయన ఎందుకు తెలియదు. బాగా వెల్ నోటెడ్ ప్రొఫెసర్. మాకు రిలేషను కూడా."

"వెంకటరెడ్డిగారు మా ఫాదరూ మంచి స్నేహితులు"

"అలాగా!"

"అవును. ఒకసారి మా ఇంటికి రండి. మా ఫాదరుని పరిచయం చేస్తాను. ఎలాగూ మా కన్‌స్ట్రక్షన్స్‌కి మీరే డిజైన్స్ గీస్తారు కదా"

"నువ్వు ఆర్కిటెక్టువే కాకుండా ప్లాన్సు కూడా గీస్తావని నేనే చెప్పాను" అన్నాడు రాఘవ.

"దానిదేముంది. అది నా ప్రొఫెషన్" రెడ్డి చెప్పాడు తెలివిగా.

"అందరికి అది ప్రొఫెషన్ గాని నా వర్కు మాత్రం మీదిలాగ చెయ్యాలి" ప్రసాదు రంగంలోకి దిగాడు.

"అలాగే చేద్దాం" రెడ్డి ఒప్పుకున్నాడు.

"అయితే సైటుకి ఎప్పుడు వెళ్దాం'' ప్రసాదు వెంటనే అడిగాడు తన కార్యక్రమాన్ని మొదలుపెడుతూ.

"నువ్వు ఎప్పుడు అంటే అప్పుడే. ఏం రెడ్డీ" అన్నాడు రాఘవ.

"సరే రేపు పొద్దున ఎనిమిది గంటలకి రెడీయేనా" ప్రసాదు ప్రోగ్రాం ఫిక్స్ చేశాడు.

"రెడీ" అన్నాడు రెడ్డి.

"రాఘవా నువ్వు కూడా రాకూడదూ రేపు?" అన్నాడు ప్రసాదు రాఘవ వైపు తిరిగి. రాఘవ తను రానని అనలేదు. కాని ప్రసాదు అలా అనటంలో ఉద్దేశ్యం రాఘవని రానివ్వకుండా చెయ్యడం. అది అతడి నైజం! రాఘవకి అర్థం అయింది. మొహమాటపడుతున్నట్లు "ఆ! నేనెందుకు నువ్వు, రెడ్డి వెళ్ళిరండి. రేపు నాకు పని కూడా ఉంది" అన్నాడు రాఘవ. ప్రసాదుకి ఎవరిని ఎలా కట్ చెయ్యాలో బాగా తెలుసు. అతడి పథకం పారినందుకు సంతోషించాడు.



"ఈ రోజు పొద్దున అద్దంలో చూసుకుంటుంటే నేను చాలా అందంగా ఉన్నాననిపించిందే సుశీలా"

"ఫర్వాలేదు పొరబడటం అనేది మానవ సహజం"

సి.హెచ్. మృత్యుంజయ

ఆ తరువాత సైటు డిజైను, ప్లాను నుంచి అన్ని విధాల రెడ్డిని తనతో తిప్పుకున్నాడు ప్రసాదు.

రాఘవ ప్రసాదుని కలుద్దామని వెళ్ళాడు.

ప్రసాదు దొరకలేదు.

రెండు మూడు సార్లు ఫోను చేశాడు. ఫోన్లో సమాధానం కూడా ప్రసాదు లేడని.

రెడ్డి దగ్గరకు వెళ్ళాడు రాఘవ. రెడ్డి ఆఫీసులో లేడు. అతడి అసిస్టెంట్ ఉన్నాడు. డిజైన్లు గీసుకుంటున్నాడు.

రాఘవని చూడగానే "రెడ్డిగారు లేరండి. ప్రసాదు గారి పని మీద వెళ్ళేరు. ఇప్పుడు నేను గీస్తున్న డిజైన్లు కూడా ఆయనవే" అని చెప్పాడు.

ఆ తరువాత రాఘవకి తెలిసిందేమిటంటే రెడ్డి, ప్రసాదు బాగా స్నేహితుల్లా తిరుగుతున్నారని.

రెడ్డి కోసం చాలా సార్లు ప్రయత్నించాడు రాఘవ. ఒకసారి ఫోనులో దొరికాడు రెడ్డి.

"ఏంటి రెడ్డి? ప్రసాదు పని పూర్తయిందా?" అడిగాడు రాఘవ.

"ఎప్పుడో పూర్తయింది. ప్రసాదు నేను కలిసి పౌల్ట్రీ పెడదామనుకుంటున్నాం."

"ఎక్కడ"

"ఇంకా నిర్ణయించలేదు. ప్రసాదే అంతా చూసుకుంటానన్నాడు."

"అలాగా! కంగ్రాచ్యులేషన్స్. మీ ఇద్దరూ అంతగా కలిసిపోయారన్న మాట" అన్నాడు రాఘవ. 'రెడ్డిని ప్రసాదు బాగా బుట్టలో వేశాడు' అనుకుని.

"ప్రసాదుకి పలుకుబడి ఉంది. మనకి టాలెంట్ ఉంది. ఉపయోగించుకుందామని" అన్నాడు రెడ్డి.

"బాగా ఉపయోగించు. విష్ యూ ఆల్ ది బెస్ట్!" అంటూ ఫోను పెట్టేశాడు రాఘవ.

అది జరిగిన కొన్ని నెలలకి....

నేను, రాఘవ, రెడ్డి అనుకోకుండా కలవడం తటస్థించింది కథ మొదట్లో చెప్పినట్లు.

ముగ్గురం ఒక దగ్గర కూర్చున్నాం.

అప్పుడు ప్రసాదు ప్రసక్తి వచ్చింది. అయితే ఇంతటితో అయిపోలేదు.

రెడ్డి మొదలుపెట్టాడు. మిగిలిన విషయం. "మా ఇద్దరం కలిసి తిరుగుతున్న సమయంలో నా ఫ్రెండ్ కుమార్‌ని ప్రసాదుకి పరిచయం చేశాను. వాడికి రాజకీయ పలుకుబడి ఉంది. మినిష్టరు గారి చుట్టం. అంతే. నన్ను ఒక పక్కకి తోసేసి కుమార్‌తోనే తిరగటం ప్రారంభించాడు ప్రసాదు."

రాఘవ, నేను ఆశ్చర్యంతో అలా చూస్తూ ఉన్నాం. రెడ్డి ఊపిరి పీల్చి, కుర్చీలో వెనక్కు వాలి

"ఒక రోజు ప్రసాదుని అడిగాను ఏంటి ప్రసాద్! పౌల్ట్రీ ఏదో పెడదామన్నావు. ఏమయింది? అని" అడిగాడు రెడ్డి.

"నీకు డిజైన్లు గీయటం, ప్లాన్లు ఇయ్యటంతోనే సరిపోతుంది కదా. ఇంకా నీకు టైమ్ ఎక్కడ కుదురుతుంది. ఇప్పటికి ఆ విషయం మర్చిపోదాం. తరువాత నీకు సరిపోయేది ఏదైనా ఇంకో బిజినెస్ ఆలోచిద్దాం'' అన్నాడు ప్రసాదు ఏ మాత్రం తొణకకుండా.

ఈడ్చి చెంప మీద కొట్టినట్లయింది రెడ్డికి.

ప్రసాదు విషయం నెమ్మదిగా అర్థమయింది. అప్పటికే కుమార్‌తో పరిచయం పెంచుకుని అతడితో తిరుగుతున్నాడు ప్రసాదు. ఎందుకైనా మంచిదని కుమార్‌కి ముందుగా ఓ హెచ్చరిక చేస్తే శ్రేయస్కరం అన్పించి రెడ్డి కుమార్‌ని కలిశాడు.

ప్రసాదు గురించి రెడ్డి చెప్పింది కుమార్ విన్నాడు. సమాధానం చెప్పలేదు. నవ్వాడు. నవ్వి.

అంతటితో ప్రసాదుని మరి కలవలేదు రెడ్డి. అయితే కుమార్ అనుభవం ఎలా ఉంటుందా అని ఎదురు చూస్తున్నాడు.

నాకు రాఘవకి కూడా అలాగే ఉంది.

"అయినా అటువంటి మనిషేమిటి? ప్రసాద్! తన పని అయిపోయిన వెంటనే ఎదుటి వాడు మరి కన్పించడా?" బాధగా అన్నాడు రాఘవ.

"అది వాడి నైజం. నో బడీ కెన్ హెల్ప్ ఇట్" అన్నాను నేను.

"అంతవరకూ బాగానే ఉంది. కాని ఇప్పుడు ఆ కుమార్ సంగతి ఏమవుతుందో చూడండి. తనకి కావల్సిన పనులన్నీ చేయించుకుని వాడిని కూడా ఏమీ కానట్లు వదిలేస్తాడు" అన్నాడు రెడ్డి. అనవసరంగా కుమార్‌ని ప్రసాదుకి పరిచయం చేశానని బాధపడుతూ.

అంతటితో ఆ విషయాన్ని ఆపేసాం. మా వ్యాపారం, వ్యవహారాల్లోకి వెళ్ళిపోయాం. మళ్ళీ ఆ ఊసెత్తలేదు.

ఆ తరువాత కొన్ని నెలలు అయినాక,

రెడ్డి, రాఘవ కలిసి ఆదరాబాదరా పరుగుల మీద నా దగ్గర కొచ్చారు. 'అమ్మ! ఈ కుమార్ పని కూడా అయిపోయినట్లుంది. ప్రసాదు బాధితుల సంఘంలో ఆయన కూడా ఓ సభ్యుడుగా చేరాడేమో అనుకున్నాను. రెడ్డి మొహం, రాఘవ మొహం మతాబుల్లా వెలిగిపోతున్నాయి.

ముగ్గురమూ కుర్చీల్లో కూర్చున్నాక రాఘవ చెప్పాడు -

"తాడిని తన్నే వాడుంటే వాడి తలని తన్నే వాడుంటాడట. ఆ ప్రసాదు మనల్ని అన్నంలో ఉప్పులాగ, చారులో కరివేపాకులాగ వాడుకుంటే ఈ కుమార్ గొప్ప దెబ్బ ఇచ్చాడు. ప్రసాదు చేత తన అవసరాలు కొన్నితీర్చుకుని వాడిని ఈయన చుట్టూ తిప్పుకుంటున్నాడు. మినిష్టరు గారితో చెప్పి ఏదో పని చేయిస్తానని డబ్బులు కూడా తీసుకున్నాడట. ప్రసాదు అతడి చుట్టూ తిరుగుతున్నాడు. అసలు ఇంతటి ప్రసాదు కుమార్‌కి ఎలా దొరికిపోయాడో ఆశ్చర్యంగా ఉంది."

"దేనికైనా టైమ్ రావాలి కదా" అన్నాడు రెడ్డి.

నాకు నేను ఆపుకుందామన్నా ఆపుకోలేని నవ్వు వచ్చింది. బిగ్గరగా నవ్వాను. వాళ్ళిద్దరు కూడా శృతి కలిపారు.